క్లుప్తంగా

బాణసంచా దుకాణాలకు అనుమతి

మొవ్వ: దీపావళి సందర్భంగా మొవ్వ మండలంలో 11 బాణసంచా విక్రయ షాపులకు అనుమతినిస్తూ లైసెన్సులు మంజూరు చేశారు. పెదపూడి వర్తక సంఘ కల్యాణ మండపంలో నాలుగు, నిడుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నాలుగు, మొవ్వ, కాజలో శివాలయం వద్ద, కోసూరు పీఏసీఎస్ ఆవరణలో ఒక్కొక్క దుకాణానికి అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారుల బృందం సోమవారం స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ కే మస్తాన్, ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ కిషోర్, ఆర్ఐ విజయదుర్గ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి



గుడివాడ టౌన్: పట్టణంలోని ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించేందుకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, బేతవోలు, దనియాలపేట, ఇందిరానగర్ కాలనీ, వాంబే కాలని తదితర ప్రాంతాల్లో సోమవారం అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావుతో కలిసి పర్యటించారు. ప్రత్యేకించి డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ఈ పర్యటన చేస్తున్నామన్నారు. చాలామంది డ్రెయిన్లలో వ్యర్థాలు వేస్తూనే ఉన్నారన్నారు. తొలుత దానిని నిర్మూలించేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

అక్రమంగా ఏర్పాటు చేసే చేపల చెరువులను అరికట్టాలి


మండవల్లి: కొల్లేరులో అక్రమంగా ఏర్పాటు చేసిన చేపల చెరువులను అరికట్టాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు, కె.సూర్యారావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ గోపాల్‌కు, ఎంపీడీఓ రామలింగేశ్వరరావుకు మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. కొల్లేరు ఆపరేషన్‌లో అదనంగా ధ్వంసం చేసిన భూములు కొల్లేటి వాసులకు తిరిగి ఎప్పుడు ఇస్తారో తెలియజేయాలని కోరారు.

సమాజ సేవే లక్ష్యం



గుడివాడ టౌన్: సమాజంలో పలు అవసరాలను గుర్తించి సేవలు చేయడమే రోటరీక్లబ్ లక్ష్యమని క్లబ్ జిల్లా (3020) గవర్నర్ డాక్టర్ మల్లా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన అధికార పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు రెండు ట్రై సైకిళ్లు, బుడమేరు వరద బాధితులకు రూ. 2,100 విలువ చేసే 73 కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రోటరీక్లబ్ అంతర్జాతీయ సంస్థ డీఆర్ 1177 నుంచి 25 వేల డాలర్లు వరద సహాయనిధిగా అందజేశారని, వాటి ద్వారా రూ. 2,100 విలువగల 1,000 కిట్లు తయారు చేసి వరద బాధితులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్, కార్యదర్శి జి. కిరణ్‌బాబు, కోశాధికారి ఎస్. ప్రసాదు పాల్గొన్నారు.

జీవీ మాల్‌లో అగ్నిప్రమాదం



గుడివాడరూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ రోడ్డులో ఉన్న జీవీ మాల్ ఐదో అంతస్తులో ఎయిర్ కండీషన్ షార్ట్ సర్క్యూయట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా మంటలు ఏర్పడి పొగలు వ్యాప్తి చెందాయి. ప్రమాదం తలెత్తడంతో వినియోగదారులు, సిబ్బంది ఒక్కసారిగా భయాందోళన చెందారు. వెంటనే సిబ్బంది సమాచారాన్ని అగ్నిమాపక సిబ్బందికి తెలపడంతో సకాలంలో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బందికి జీవీ మాల్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యాన స్థానిక లయన్స్ సేవా భవన్‌లో సోమవారం నిరు పేదలకు దుప్పట్ల పంపిణీ చేపట్టారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జంగం నళినీబాయ్ స్మారకార్థం ఆమె భర్త మోహనరావు ఆర్థిక సాయంతో నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ శశికళ తెలిపారు. లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, ప్రతినిధులు చంద్రబోస్, నాగేశ్వరరావు, రామకృష్ణ, పరంధామయ్య పాల్గొన్నారు.

క్షణ క్షణం భయం భయం..!

● శిథిలావస్థలో చింతపాడు పాఠశాల భవనం ● పట్టించుకోని అధికారులు

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితిలో చింతపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు భయం భయంగా చదువులు కొనసాగిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, నేలమట్టం చేయాలని నిపుణులు నిర్ధారించినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితిలో అక్కడే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది.



శిథిలావస్థకు చేరిన చింతపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల



గదులు లేకపోవడంతో ఆరుబయట వేదికపై పాఠాలు చెబుతున్న దృశ్యం

మండవల్లి/కైకలూరు: చింతపాడు ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో పాటు లోతట్టు ప్రాంతంలో ఉండటంలో వర్షం కురిసిన ప్రతిసారీ వర్షం నీరు పాఠశాల చుట్టూ చేరుతోంది. దీంతో విద్యార్థులు భయం గుప్పెట్లో చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి. ఈ ఉన్నత పాఠశాల ప్రధాన భవనాలను 1993లో నిర్మించారు. మొత్తం రెండు అంతస్తుల్లో 10 గదులు ఉన్నాయి. ఈ పాఠశాలలో మూడు నుంచి 10వ తరగతి వరకు సుమారు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. సమీపంలోని కొల్లేరు గ్రామాలకు ఉన్నత పాఠశాల ఇదొక్కటే కావడంతో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోంది. ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో 2021లోనే కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు.

శ్లాబ్ పెచ్చులూడి పడుతున్న వైనం

చింతపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు త్రుటిలో ప్రమాదాలు తప్పుతున్నాయి. అనేక సందర్భాల్లో శ్లాబ్ పెచ్చులూడి కింద పడ్డాయి. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు పలుమార్లు ప్రమాదాలు తప్పాయి. ఈ నెల 18న విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసే సమయంలో ఏడో తరగతి విద్యార్థిని ఘంటసాల జయశ్రీ తలపై శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడి తలకు గాయమైంది. వెంటనే కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి గాయానికి ఐదు కుట్లు వేశారు. ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతున్నా కొన్ని వెలుగులోకి రావడం లేదు. ఇటీవల ఓ బాలికపై లైంగికదాడి ఘటన మరువకముందే శ్లాబ్ కూలి విద్యార్థిని గాయపడటం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల వడ్డీ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బలే ఏసురాజు, నాయకులు ముంగర కొండలు (ఎంకే) చింతపాడు పాఠశాలను సందర్శించి, కలెక్టర్‌కు ఇక్కడి సమస్యను నివేదించారు.

శిథిల భవనంలో తరగతులు నిలిపివేశాం



శ్లాబ్ పెచ్చు ఊడి విద్యార్థినికి గాయమైన విషయం నిజమే. ప్రస్తుతం తరగతులను శిథిల భవనంలో నిర్వహించడం లేదు. జిల్లా పరిషత్ సీఈఓ శిథిల పాఠశాలను కూల్చివేయాలని ఆదేశించారు. పిల్లల సంఖ్య అధికంగా ఉండటంతో మరో దారి లేక పాత భవనంలో భోజనాలు పెడుతున్నాం. ఇప్పుడు పూర్తిగా దానిని మూసివేశాం.

– కేఎస్ఆర్ ఆంజనేయులు, హైస్కూల్ హెచ్ఎం, చింతపాడు.

నూతన భవనాలను నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన పాఠశాలలో భయం భయంగా గడుపుతున్నాం. మధ్యాహ్నం భోజనం చేస్తుండగా శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడ్డాయి. దీంతో నా తలకు తగిలిన గాయానికి వైద్యులు ఐదు కుట్లు వేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నూతన పాఠశాల భవనాలను నిర్మించాలి. తరగతి గదులు లేక ఆరుబయట చదువులు కొనసాగిస్తున్నాం.

– ఘంటసాల జయశ్రీ, 7వ తరగతి విద్యార్థిని

నిధుల కొరతతోనే ఆలస్యం



చింతపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీనిని కూల్చివేయాలని ఆదేశాలు అందాయి. నిధుల కొరత కారణంగా ఆలస్యమైంది. విద్యార్థులు అధికంగా ఉండటంతోపాటు గదుల కొరత కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయి. శిథిలమైన పాఠశాల భవనాన్ని కూల్చివేసి, నూతన భవనం నిర్మిస్తాం

– రత్నసునాదం, ఎంఈఓ, మండవల్లి

గుడివాడ డీఎస్పీగా పవన్‌కుమార్



గుడివాడరూరల్: గుడివాడ డీఎస్పీగా దేవినేని పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈయన డైరెక్ట్, మొదటి పోస్టింగ్‌గా గుడివాడ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన పి.శ్రీకాంత్ బదిలీ అయ్యారు.

గౌతమేశ్వరునికి ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: కౌతవరం శ్రీ గంగా పార్వతీదేవి సమేత గౌతమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలను చేపట్టారు. తొలుత వేద పండితుడు అంబా గౌతమేశ్వరరావు స్వామివార్లకు విశేషాభిషేకాలను వేద మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివార్లను దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు.

తప్పొప్పులను సరి చేయించుకోవాలి

అయ్యంకి(మొవ్వ): గతంలో జరిగిన భూముల రీ సర్వేలో ఏమైనా తప్పులు దొర్లితే రైతులు కంగారు పడకుండా సరి చేయించుకోవాలని డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐఎస్, ఉయ్యూరు) శివరామ ప్రసాద్ పేర్కొన్నారు. మొవ్వ మండలం అయ్యంకి పంచాయతీ కార్యాలయంలో రీ సర్వేలో జరిగిన భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన గ్రామ సభలో డీఐఎస్ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. లొకేషన్, విస్తీర్ణం, ఫోన్ నంబర్లు, సర్వే నంబర్లు తదితర అంశాల్లో తప్పులు వచ్చినట్లయితే సరిచేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అయ్యంకి గ్రామంలో 2316.33 ఎకరాల్లో నిర్వహించిన రీసర్వే పై జరిగిన ఈ సభలో గ్రామ సర్పంచ్ నాగసబోయిన సునీల్‌కుమార్, రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ పి.జగన్‌మోహన్‌రావు, మండల సర్వేయర్ ఏ. కిషోర్, సచివాలయ సర్వేయర్ వీర్ల కావ్య, వీఆర్వో నరసింహారావు, కార్యదర్శి ఎస్.ప్రభుకుమార్, పెడసనగల్లు, భట్లపెనుమర్రు, అవురుపూడి, మొవ్వ-1 సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మొవ్వ: ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో మొవ్వ శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ మొవ్వ విద్యార్థినులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో 1,500 మీటర్ల రేసులో చైతన్య లక్ష్మి ప్రథమ స్థానం, అన్నవరపు హాసిని ద్వితీయ స్థానం సాధించారు. వీరిని సోమవారం పాఠశాల్లో జరిగిన అభినందన సభలో ఇన్‌చార్జి హెచ్ఎం పసుపులేటి శివ కోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ కార్యదర్శి జాకీ అహ్మద్, ఎస్ఎంసీ చైర్మన్ గురువిందపల్లి బాబురావు, పాఠశాల ఉపాధ్యాయ కుటుంబం అభినందించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల రామారావు మాట్లాడుతూ నవంబర్ నెల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో పీడీ, ఇన్‌చార్జి హెచ్ఎం

అథ్లెటిక్స్‌లో పామర్రు జెడ్పీ విద్యార్థిని ప్రతిభ

పామర్రు: గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పామర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచిందని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురా ఇందిరాణి పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్లో సోమవారం విజేతను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని షర్మిక డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. త్వరలో శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని హాజరవుతుందన్నారు. షర్మికతోపాటు శిక్షణ ఇచ్చిన పీడీలు మురళీ, రవికిషోర్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



విజేతతో హెచ్ఎం ఇందిరాణి, పీడీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

పామర్రు: ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన స్పోర్ట్స్ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆసీస్సీ ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబాస్టియన్ తెలిపారు. స్థానిక హైస్కూల్లో విజేతలను సోమవారం అభిందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్-14 విభాగంలో డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం షార్టు పుట్‌లో తృతీయస్థానం సాధించారని తెలిపారు. త్రిపుల్‌జంప్‌లో దయాకర్ ప్రథమ స్థానం, గౌరి ద్వితీయ స్థానం పొందారన్నారు. ఐదు కిలోమీటర్ల వాకింగ్ పోటీలో తృతీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. విజేతలైన వీరిని, వీరికి శిక్షణ ఇచ్చిన పీఈటీ మట్టా గ్లాడిసన్‌ను ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ రోజీ థామస్‌లు ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సిస్టర్ సబాస్టియన్

ఘనంగా కుంతీదేవి పండగ



తోట్లవల్లూరు: కుంతీదేవి పండగ వేడుకలు మండలంలోని పాములలంకలో సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఎడ్లబండిపై అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కుంతీదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గ్రామాన్ని, పాడి, పంటలను చల్లగా చూడాలని ప్రార్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ శీలం రమేష్, వైస్ ఎంపీపీలు మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, కళ్లం శివారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోర్ల రామచంద్రరావు, నాయకులు పాత్తూరి రవి, చింతలపూడి గవాస్కర్‌రాజు, సోలే నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక



తోట్లవల్లూరు: ప్రజా సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకే ప్రజావేదిక నిర్వహించనున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆయన విజ్ఞాపనలు స్వీకరించారు. ఎంపీడీఓ రవికాంత్, తహసీల్దార్ కుసుమకుమారి, మండల పరిషత్ కార్యాలయ ఏఓ భాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ హామీని పట్టించుకోని కూటమి నాయకులు

గుడివాడ టౌన్: ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు పూర్తయినా పట్టించుకోలేదని సీపీఎం నాయకులు ఆరోపించారు. గుడివాడ-విజయవాడ మధ్య మానికొండ రోడ్ వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మహా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించేలా ప్రభావితం చేసేందుకు ఈ పాదయాత్ర చేపట్టామన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. దీనిపై తదుపరి తీసుకునే చర్యలకు తామంతా సహకరిస్తామని ప్రజలు తెలిపారన్నారు. ఉదయం ఏడు గంటలకు మానికొండ లాకుల వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మానికొండ, వానపాముల, వెంట్రప్రగడ, పారుపూడి మీదుగా సాయంత్రం నాలుగు గంటలకు పట్టణానికి చేరుకుంది. స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌సీపీ రెడ్డి, లక్ష్మణస్వామి, నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, రంగారావు, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, పి.రజిని, శివనాగమల్లేశ్వరరావు, ఆర్.కొండ, బీవీ.శ్రీనివాస్, ఎస్ఎస్ఐ నాయకులు సమరం, ప్రభుదాసు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

మానుగాయ తెగులు నివారణకు చర్యలు

పమిడిముక్కల: ప్రస్తుతం వరిపైరులో కనిపిస్తున్న మానుగాయ తెగులు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని డీఆర్సీ డీడీఏ జ్యోతిర్మయి రైతులకు సూచించారు. మండలంలోని మంత్రివాడలో వ్యవసాయశాఖ, జిల్లా రిసోర్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తదుపరి పంటగా వేసుకునే మినుము, పెసరలను తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసి చల్లుకోవాలన్నారు. తద్వారా చీడపీడల బారినుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ఏఓ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న మిల్లులకు ధాన్యం తోలుకునే విధంగా మార్పులు చేశారని వివరించారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏఓ పద్మజ, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రివాడలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న రైతులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కైకలూరు: ఉపాధి హామీ పథకం పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ, ప్రజావేదిక సోమవారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం జిల్లా ఏపీడీ దామోదర్ ఆధ్వర్యంలో మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన పనులపై ఆడిట్ నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ పలు గ్రామాల్లో మస్టర్లలో చిన్న లోపాల కారణంగా బాధ్యులకు రూ.2వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర, విజిలెన్స్ అధికారి పురుషోత్తం రాజు, ఆడిట్ ఎస్ఆర్‌డీ సూర్యచంద్ర, ఏపీఓ శరణ్ పాల్గొన్నారు.

సహజనటి సూర్యకాంతం

గుడివాడ టౌన్: సహజ నటి, హాస్య శిరోమణి సూర్యకాంతం అని వక్తలు అన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సినీ నటి సూర్యకాంతం శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ జరిగింది. తొలుత ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 700కు పైగా చిత్రాల్లో నటించి జీవించిన గొప్ప నటి సూర్యకాంతం అన్నారు. పట్టణంలో ఆమె విగ్రహ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. ఆ సంఘం సభ్యులు భవిరి శంకర్‌నాథ్, సత్యనారాయణ, జి.రాజు, ఎ.కోటేశ్వరరావు, మాల్యాద్రి, శ్రీనివాసరావు, ఎస్. ప్రసాదు పాల్గొన్నారు.

స్వశక్తి సంఘాలు సంఘటితంగా పనిచేయాలి

పామర్రు: స్వశక్తి సంఘాలు సంఘటితంగా ఉంటూ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని యూనియన్ బ్యాంక్ మచిలీపట్నం రీజియన్ రీజినల్ మేనేజర్ వెంకట్రావ్ అన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్‌లో స్వశక్తి సంఘాల సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల వెసులు బాటుకు ప్రతి ఏటా కోట్లలో రుణాలను అందిస్తున్నామన్నారు.

సంక్షిప్త వార్తలు

■ పిచ్చి మొక్కల తొలగింపు

గుడ్లవల్లేరు: కౌతవరం ఒకటో వార్డు నుంచి మామిడికోళ్ల వెళ్లే పుల్లేరు కాల్వ గట్టు ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు వర్షాల్లో కమ్మేశాయి. గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు తమ పారిశుద్ధ్య కార్మికులతో సోమవారం పిచ్చిమొక్కలను తొలగించారు. గుడ్లవల్లేరులోని అంబేడ్కర్ నగర్, రెండు వార్డు డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు పనులను చేపట్టారు.

■ వినియోగదారులకు ఉత్తమ సేవలే లక్ష్యం

మండవల్లి: లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యమని వెన్నార్ సిరామిక్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిసుమంత్ పేర్కొన్నారు. పెరికెగూడెంలో సోమవారం అంజని టెక్స్‌టైల్స్ పార్క్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఫ్లోరింగ్, వాల్, పార్కింగ్ టైల్స్, అన్ని వేరియంట్లు నాణ్యతతో కూడిన ఉత్పత్తులను తక్కువ ధరకు అందించేందుకు టైల్స్ పార్కు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కెటింగ్ ప్రెసిడెంట్ గాంధీరాజు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, కంపెనీ జీఎం అమర్నాథ్, హెచ్ఆర్ ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ రీసర్వేలో రైతుల వినతులు స్వీకరిస్తాం

గుడ్లవల్లేరు: రీసర్వేలో రైతులు తమ అభ్యంతరాలతో కూడిన వినతులు, ఫిర్యాదులను ఇస్తే స్వీకరిస్తామని రీసర్వే డీటీ రత్నకుమారి పేర్కొన్నారు. మండలంలోని ఉలవలపూడిలో రీసర్వే గ్రామసభను సోమవారం నిర్వహించారు. వినతుల్లో సమస్యల పరిష్కారం వైపు చర్యలు తీసుకుంటామని డీటీ చెప్పారు. ఉలవలపూడి సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, వీఆర్వో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

■ విజేతలకు బహుమతులు

పామర్రు: యూనియన్ బ్యాంక్ పామర్రు శాఖ వారి విజిలెన్సు అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఈ నెల 23వ తేదీన మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించి సోమవారం ఫలితాలను స్థానిక ఏఎన్ఎం హైస్కూల్లో వెల్లడించారు. ఈ ఫలితాల్లో స్థానిక ఏఎన్ఎం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో గెలుపొందారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి జీ దినీషప్రియ ప్రథమ స్థానం సాధించి రూ.1,000 నగదు బహుమతిని అందుకున్నారన్నారు. 8వ తరగతి విద్యార్థిని నాగ వైష్ణవి ద్వితీయ స్థానం సాధించి రూ.800 పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న 45 మందికి బహుమతులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ దుర్గా ప్రసాద్ అందజేశారు. సబ్‌బ్రాంచ్ మేనేజర్ సమీర్ పాల్గొన్నారు.

■ పోలీసుల రక్తదానం

కైకలూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏలూరు ఎస్పీ కార్యాలయంలో సోమవారం కైకలూరు రూరల్ సర్కిల్ పరిధిలోని సీఐ వి.రవికుమార్, 25 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. ఎస్పీ కేపీ శివకిషోర్ పోలీసు సిబ్బంది సేవలను అభినందించారు.

■ కొల్లేరు ప్రజలకు సబ్సిడీ వర్తింపజేయండి

కైకలూరు: కొల్లేరు పరివాహక ప్రాంత ప్రజలకు సబ్సిడీపై పరికరాలు అందించాలని విజయవాడలోని మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు వినతిపత్రాన్ని రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనరు బలే ఏసురాజు సోమవారం అందించినట్లు తెలిపారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించారని ఏసురాజు పేర్కొన్నారు.

■ ఎల్ఐసీ పాలసీ బోనస్ పెంచాలి

కైకలూరు: ఎల్ఐసీలో పాలసీ బోనస్‌లు పెంచాలని లియాఫీ కార్యవర్గ సెక్రటరీ ఎన్.కృష్ణానందరావు డిమాండ్ చేశారు. కైకలూరు ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సోమవారం ఏజెంట్లు నిరసన కార్యక్రమం చేపట్టారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com